**కృష్ణాష్టమి ప్రత్యేకం**

# రుక్మిణీ కళ్యాణం



శ్రీమదాంధ్ర భాగవతంలో బమ్మెర పోతనామాత్యుడు సర్వ స్కంధములూ రుచికరంగానే రచించాడు. కానీ దశమ స్కంధంలో రుక్మిణీ కల్యాణ ఘట్టంలో మాత్రం మరింత సురుచిరమై మనోహ్లాదకరమై వుంటుంది. ఒకనాడు మన ఆంధ్రులలో, రుక్మిణీ కల్యాణంలో కొన్ని పద్యాలైనా నోటికిరాని కుటుంబం వుండేదిగాదు. కృషీవలుడైన కవి పోతన సాహితీ క్షేత్రంలో ప్రకృతిని పండించాడు. అందుకే ఆ రచనకి అంతటి అందం అమరింది. మామూలు మనిషి కానలేని అందచందాల్ని ఆయన తన సృజనాత్మక శక్తితో, అనుభవసారాన్ని మేళవించి, తన కావ్యం లో కరతలామలకం చేశారు.

ఎప్పుడైనా, సాయంత్రం, మునిమాపువేళలో పడమటి ఆకాశంపై పండిన తదియ నాటి చంద్రుణ్ణి చూశారా మీరు! కుండిన నగరం రాజధానిగా విదర్భ దేశాన్ని పాలించే భీష్మక మహారాజుగారింట్లో రుక్మిణి జన్మించింది మొదలు, బాలేందు రేఖ దోచిన లాలిత యగు నపర దిక్కు లాగున ధరణీ పాలుని నేహము మెరిసిందట. రుక్మి, రుక్మరథ, రుక్మబాహు, రుక్మకేశ, రుక్మనేత్రులనే అయిదుగురు అన్నదమ్ములకి కడగొట్టు చెల్లెలై, అల్లారుముద్దుగా పెరుగుతోందా ఇంట్లో రుక్మిణీదేవి.

శుక్లపక్ష చంద్రుడిలా దినదినాభివృద్ధి చెందుతున్న ఆమె చిన్నప్పుడు ఆడే ఆటలు కూడా స్త్రీ సహజమైనవే! నలుగురాడపిల్లల్ని పోగుచేసి, బొమ్మల పెళ్లిళ్లు చేసి తాను వియ్యపురాలు అవుతుంది. గుజ్జెనగూళ్లలో చక్కని వంటకాలు చేయించి అందరికీ పంచిపెట్టుతుంది. ఇంటి చుట్టూ వున్న తోటలో పూదీగలకు ప్రోదెలు చేసి నీళ్లు పోస్తుంది. తన భవంతిలో వున్న బంగారు తూగుటుయ్యాలల్లో ఒయ్యారంగా ఊగుతుంది. పిల్లలందరితో బంతులాడుతుంది. చిలుకలకు పలుకులు నేర్పుతుంది. నెమళ్లకు మురిపాలు నేర్పుతుంది. రాయంచలకు మందగతులు నేర్పుతుంది. ఆమెకు వయసు వస్తున్నకొద్దీ శరీరం కాంతిపుంజాల్ని వెదజల్లజొచ్చింది. ఆమె యౌవన ప్రాంగణంలో అడుగుపెట్టే వేళకు అవయవ సౌష్టవం కూడా శరీరపు వంపుసొంపుల్ని తీర్చిదిద్ద సాగింది. నెమ్మదిగా మనసు ఆటపాటల మీద నుంచి మళ్లి, పెద్దల మాటలు పట్టించుకోవడం, వారి మాటల్లో అర్థాల్ని గ్రహించుకుని తనకి అన్వయించుకోవడం నేర్చుకుంది.

ఇంటికి వచ్చిన పెద్దలు శ్రీకృష్ణుని గుణగణాల్ని, అందచందాల్ని, అతని అతిమానుష చేష్టల్ని చిత్ర విచిత్రంగా వర్ణించి చెప్తుతూంటే శ్రద్ధగా వింది. అటువంటి మహా పురుషుణ్ని పొందిన స్త్రీ జన్మ ధన్యం అనుకుంది.

యుక్తవయసు వచ్చిన ఆడపిల్ల ఇంట్లో ఉంటే, చూడవచ్చిన చుట్టాలకి, చెప్పడానికి కావలసినన్ని సంబంధాలుంటాయి. కాని అదేమిచిత్రమో భీష్మకుని ఇంటికి వచ్చిన చుట్టాలందరిదీ ఒకటే మాట! రుక్మిణికి తగిన వరుడు శ్రీకృష్ణుడొక్కడే అని. ఆ మాటలు వినీ, వినీ రుక్మిణికి కృష్ణుడంటే మక్కువ ఇంకా ఎక్కువ కాసాగింది. కాని ఒక్కటే చిక్కొచ్చిపడింది. పెద్దన్నయ్య, రుక్మి మాత్రం ఈ సంబంధానికి ససేమిరా ఒప్పుకోవడం లేదు. సరికదా, తన తరఫున శిశుపాలుడ్ని పెళ్లికొడుకుగా స్థిరపరిచేసేడు కూడా! ఇంట్లో అందరిదీ, తన యిష్టంతోసహా ఒకదారయితే, ఈ అన్నయ్య ఒక్కడూ ఇలా పట్టుపట్టడం రుక్మిణికి అంతగా రుచించ లేదు.

ఇంకా తనకేనా అంత పట్టుదల లేనిది అని పించింది కూడా. తల్లిదండ్రులు తన క్షేమం కోరేవారేగాని, పెద్దబ్బాయిని ధిక్కరించి వివాహం చేసే ధైర్యం వారికి లేదు. తనే ఏదో గత్యంతరం ఆలోచించాలి. లేకపోతే పరిస్థితి చేజారిపోవచ్చు.

ఇలా ఆలోచిస్తున్న రుక్మిణికి ఓ మంచి ఊహ తట్టింది. అగ్నిద్యోతనుడనే రాజపురోహి తుడికి కబురు చేసింది. ఆయన రాగానే తన వివాహం ఒక సమస్యగా ఎలా పరిణమిం చిందో వివరించింది. ఎల్లాగైనా కృష్ణుడి మీదే తన మనసు లగ్నమై ఉందనీ, ఆయనకి తన మాటగా అన్నీ చెప్పి ఒప్పించి, తీసుకొచ్చి, వివాహం జరిపించే బాధ్యత మీదేననీ ప్రాధే యపడింది.



ఇక్కడి విషయాలక్కడికీ, అక్కడి విషయా లిక్కడికీ చేరవేయడం, కార్యం సానుకూల్యం చేసుకురావడం రాజపురోహితులకి వెన్నతో పెట్టిన విద్య. అగ్నిద్యోతనుడు రుక్మిణిని నిర్భ యంగా ఉండమని చెప్పి రాయబారానికి ద్వారకకు వెళ్లాడు.

అక్కడ శ్రీకృష్ణమూర్తివారి దర్శనం చేసు కుని ''పెళ్లికొడుకువు కమ్మ''ని దీవించాడు. సర్వం తెలిసిన పురుషోత్తముడు ముసి ముసి నవ్వులు నవ్వాడు. వచ్చిన అతిథిని ప్రసన్ను డిని చేసుకోవడానికి తనే స్వయంగా గద్దె దిగి వచ్చి, దేవతలు తనకెలా పూజ చేస్తారో, అంతగా ఆయనకి పూజా పునస్కారాలు చేశాడు. లోకాలికి అభయమిచ్చే తన కరకమ లాలతో ఆయన కాళ్లు ఒత్తుతూ, మెల్లగా ఇలా అన్నాడు:

''స్వామీ! అల్ప సంతోషులైన మీరు సంతోషచిత్తులు. మీవంటివారు ధర్మాతి క్రమం లేకుండా ప్రవర్తించడం వల్ల మీ కోరికలు వాటంతట అవే తీరుతూంటాయి. అటువంటి మీరు నాకు పూజ్యులు. ఇంతకీ మీదే దేశం? ఎందుకిలా వచ్చారు? సందే హించక చెప్పండి!''

అప్పుడు అగ్నిద్యోతనుడు ముంత బైటపెట్టాడు. ''దేవా! విదర్భ దేశాధీశుడైన భీష్మకునికి రుక్మిణి అనే సౌందర్యవతియైన కుమార్తె ఉంది. ఆమె తన మాటలుగా విన్నవించమన్న సందేశం ఒకటుంది. సావధాన చిత్తుడవై వినగోరెదను.

మానినీ చిత్తచోరా! నీ గుణగణాల వర్ణన వింటే చెవులు పవిత్రం అవుతాయి. నిన్ను చూచిన జన్మ తరిస్తుంది. నిత్యమూ నీ సేవలు చేసుకుంటే సకలౌన్నత్యాలూ కలుగు తాయి. రోజూ నీ నామ సంకీర్తనం చేస్తే పాపాలు పటాపంచలైపోతాయి. అటువంటి మహానుభావుడవైన నిన్నే నా మనసు కోరుకుంటోంది.

నిన్నే వరునిగా నేనెందుకెన్నుకున్నానంటావేమో! కృష్ణా! నీవు ధన్యుడవు. లోక మనోభి రాముడవు, కులీనుడవు, విద్యావంతుడవు. రూపసివి, యౌవనవంతుడవు, సుజనుడవు, శ్రీమంతుడవు, బలవంతుడవు, దాతవు, శౌర్యగుణాభి రాముడవు, కరుణా సముద్రుడవు. ఇన్ని సుగుణాలున్న నీపై ఏ కన్నెపిల్లయినా మనసు పారేసుకోవడం ఒక ఆశ్చర్యకరమైన విషయం కాదు. మున్ను నిన్ను లక్ష్మీదేవి వరించలేదా నేనెంతటిదానను దేవా!

పురుష సింహమా! సింహానికి చెందవల సిన సొమ్ముకి నక్క ఆశపడినట్లు, నిన్నే హృద యంలో నింపుకున్న నన్ను చైద్యుడు చెరబ ట్టాలని ఉవ్విళ్లూరుతున్నాడు. వాడొక అధ మాధముడు. నీ గొప్పతనం వాడికేం తెలుసు?

నేనే అదృష్టవంతురాలనైతే, నియమనిష్ట లతో నోములు వ్రతములు, పుణ్యాత్ములకు సేవలు, ధానధర్మాలు జగత్కల్యాణుడవైన నిన్ను పొందాలనే కాంక్షతో ఆచరించి ఉంటే, శిశుపాలుణ్ని యుద్ధంలో ఓడించి, నీవే నన్ను వరించెదవు గాక!

పురుషోత్తమా! రాజులకు రాక్షస వివాహం సమ్మతమే! అయినప్పుడు నీకు అడ్డంకులేల? చతురంగ బల సమేతుడవై వచ్చి, నీ శౌర్యప్రతాపాలనే కన్యాశుల్కంగా చేసి, ప్రత్యర్థుల నోడించి, నీతో తోడ్కొని వెళ్లి నన్ను వివాహం చేసుకొనవచ్చుగదా!

అయితే నీకు కొన్ని సందేహాలు ఉండ వచ్చు. నేనా అంతఃపుర కాంతను. ఎన్ని వాకిళ్లో! ఎందరు కావలివారో! ఎంతో మారణ హోమం జరిగితేనేగాని కార్యసాఫల్యం కాదనే ఊహ నీకు రావచ్చు. అందుకు నీకో ఉపాయం చెప్తాను విను. మా కుటుం బంలో ఓ ఆచారం ఉంది. పెళ్ళికి ముందు పార్వతీదేవిని పూజించేందుకు పెళ్లికూతుర్ని ఊరి వెలుపల ఉన్న దేవాలయానికి పంపు తారు. ఆ సమయంలో వచ్చి నన్ను ఎగరేసు కపో!

స్వామీ! ఒక్కమాట మాత్రం నిజమని నమ్ము. గొప్ప గొప్పవారంతా నీ పాద ధూళి తాకితేనే చాలని కోరుకుంటారు. అటు వంటి నీ పొందుకోసం నేను ఎన్ని జన్మలైనా ఎత్తుతాను. ఎన్ని నోములైనా నోస్తాను. కాని మరొకరి భార్యగా అయ్యేదిమాత్రం కల్ల.

ప్రాణేశ్వరా! భువన మోహనా! నీ సన్నిధిలో నీ చల్లని మాటలు వినలేని చెవులు, నిన్ను నిత్యమూ సంతృప్తిగా దర్శించుకోలేని కళ్లు, నీ ముద్దు మోమును ముద్దాడని అధరాలు, నిన్ను పొందలేని ఈ శరీరమూ, నీకు దాస్యం చేయలేని ఈజన్మము వృధా!''

ఇక్కడ రాజపురోహితుడు రుక్మిణి సందేశాన్ని యధాతథంగా విన్నవించాడు కాబట్టి దీన్నొక చక్కని 'ప్రేమలేఖ'గా భావించవచ్చు. నేటి ప్రేయసీ ప్రియులకిది ఒర వళ్లు దిద్దేదిగా ఉంది. మనసారా ప్రేమించిన ప్రియుడిని ఎలా మంచి చేసుకోవాలో ఈ లేఖ చదివితే తెలుస్తుంది. ముందుగా రుక్మిణి కృష్ణుడ్ని నువ్వింతటివాడివి అంతటివా డివి అని పొగిడింది. దానితో ఆయనగారు ప్రసన్నుడవడం ఖాయం. ఇంకా ప్రత్య ర్థుల్ని ఆడిపోసింది. వాళ్లంతా నీముందు దిగదుడుపేనంది. అందుకే నిన్ను ప్రేమించానంది. ఇక కృష్ణుడు మాత్రం ఎలా కాదనగలడు? ఆ కారణం చేతనే 'నేనంటే నీకిష్టమా కాదా?' అన్న ప్రసక్తే లేదు సందే శంలో. కాకపోతే ఆయనకి కలిగే ధర్మసంకటానికి ఉపాయం కూడా తానే సూచించింది. మరో సంకేతం కూడా ఇచ్చింది. ఏ కారణం చేత నైనా తన వివాహం కృష్ణుడితో జరక్కపోతే చావే శరణ్యం అంది. 'మానినీ చిత్తచోరా!' అని ఆరంభించి 'ప్రాణేశా!' అని ముగించడం

**పాలెపు బుచ్చిరాజు**

గమనార్థం.

ఈ వచ్చిన పురోహితుడు మాత్రం తక్కువవాడా?! ఆమె సందేశం అందించడం సరేసరి! 'ఆ చిన్నదాని పాదాలు లేచిగురాకుల్లాంటివి. చేతులు అరుణ ప్రభామనోహరములు. కంఠం శంఖమే! నడుమసలు ఉందో లేదో! నుదురు అర్ధచంద్రుడు, ముఖము పూర్ణేందుబింబమే. చూపులు మదనుడి తూపులయితే, ఆమె కనుబొమ్మలు ఆయన విల్లే. అంతటి సుందరాంగికి నీవే తగిన వరుడివి. నీకేమీ సందేహం అక్కరలేదు. నావంటి పురోహితుడు చెప్పున్నాడు విను. ఈ వివాహం తప్పదు. నీ వారితో వచ్చి ఆమెను తెచ్చేసుకో! నీ శత్రువుల్ని సంహరించి ఆమెను వివాహమాడు'' అని చెప్పి ''మరి నాకు సెలవేంటి? నే వెళ్ళి నీ సమాధానం ఏమని చెప్పను?'' అని అడిగాడు.



అంతా విని అగ్నిద్యోతనుడి చేతిని తన చేతిలోకి తీసుకుని కృష్ణుడిలా అన్నాడు. ''స్వామీ! మీతో చెప్పకేం! ఆ కన్నెపిల్ల మీద నాకు మనసు ముందే లగ్నమై ఉంది. ఆమె స్మరణలో నిద్ర కూడా కరువైంది. రుక్మి సుముఖంగా లేడని కూడా నాకు తెలుసు. ఇప్పుడు మీ సందేశం అందింది. చూస్తూ ఉండండి. నేను విదర్భ రావడం ఆలస్యం! కుండిన నగరం ప్రవేశించి చిటికెలో శత్రుసంహారం చేసి ఆ బాలాకుమారిని నాదాన్ని చేసుకుంటాను.''

సుముఖంగా ఉన్న కృష్ణమూర్తిని వెంటనే ప్రయాణం కమ్మన్నాడు పురోహితుడు. కృష్ణుడి ఆజ్ఞపై, సారథి సైన, సుగ్రీవ మేఘపుష్ప, వలాహకములనే నాలుగు గుర్రాల రథాన్ని సిద్ధం చేశాడు. వీరిద్దరూ రథారూఢులయ్యారు. దారిలో ఆవర్త దేశం దాటుకుని, తెల్లారే సరికల్లా విదర్భలో కుండిన నగరం చేరుకున్నారు.

ఆ నగరానికి అప్పుడే పెళ్ళి కళ వచ్చేసింది. రాజమార్గాల నుంచి, సందుగొందుల వరకు ఊరంతా చదనం నీళ్ళు జల్లారు. ధ్వజస్తంభాలకి బంగారు కల్వలమాలలు, వివిధ తోరణాలు కట్టి అలంకరించారు. ప్రతీ యింటిలోనూ, కర్పూర, కుంకుమాగరు ధూపాలు వేశారు. స్త్రీ, పురుషులు శుభ్ర వస్త్రాల్ని ధరించారు. మంగళవాద్యాలు మ్రోగుతున్నాయి.

అంతఃపురంలో రుక్మిణీదేవిని సుస్నాతను గావించారు. శుభ్ర వస్త్రాలు కట్టించారు. రత్నభూషణాల్తో అలంకరించారు. పురోహితులు వేదవిహితంగా మంగళాచరణం గావించారు. గ్రహశాంతి కోసం హోమం చేశారు. భూదాన, గోదాన, సువర్ణ దానాదులు పురోహితులకు రాజదంపతులిచ్చారు.

రుక్మిణీదేవిని పెళ్ళాడాలనే కుతూహలంతో శిశుపాలుడు చతురంగ బలసమేతంగా విదర్భకు వేంచేశాడు. కృష్ణుడు బలరాముడూ ఎలాగూ వస్తారు. యుద్ధం అనివార్యం కనుక సహాయం కోసం జరాసంధుడు, దంతవక్త్రుడూ కూడా ససైన్యంగా వచ్చారు. వివిధ దేశాల రాజులంతా వచ్చి విడిది చేశారు. శిశుపాలుడు ప్రత్యేక అతిథి కాబట్టి, ఆయనకూ, పరివారానికీ ప్రత్యేక వసతి ఏర్పాటు చేశాడు భీష్మకుడు.

అయ్యో! కృష్ణుడొక్కడే వెళ్ళాడు. ఆపత్సమయంలో ఆదుకోవలసి ఉంటుందని బలభద్రుడు కూడా వచ్చి విడిది చేశాడు.

పెళ్ళికూతురైన రుక్మిణీదేవి ఉత్కంఠ మరీ ఎక్కువైంది ''అయ్యో! ముహూర్తం రేపే! దగ్గరకొచ్చేసింది. కృష్ణుడింకా రాడేమి? అసలీ వెళ్ళిన పురోహితుడు ఏమయ్యాడో! నా యీ ప్రయత్నం సఫలమౌతుందో కాదో! బ్రహ్మరాత ఎలా ఉందో!

నేను పంపిన వెర్రి బ్రాహ్మణుడు ద్వారక చేరాడో లేదో.

**ఆమె అందచందాలు కళ్లారా కాంచిన రాజకుమారులంతా విభ్రాంతులయ్యారు. సమ్మోహితులయ్యారు. గాంభీర్యం, గౌరవ భావాల్ని మరచి చేష్టలు డిగి, రథాలుదిగి, ఆయుధాలు వదిలిపెట్టి మూర్ఛపోయారు. ఆ రాకుమార్తె కళ్ళు, కాంక్షతో యాదవ కిశోరం కోసం నానా దేశ రాజకుమార సమూహాన్ని గాలించసాగాయి.**

దారి మధ్యలోనే ఎవరికైనా దొరికిపోయాడేమో!

కృష్ణుడు నా సందేశం విని, అది చాలా తప్పని వారించాడేమో! ఆ పార్వతీ పరమేశ్వరులే నన్ను కటాక్షించాలి. ఎందుకింత ఆలస్యం అవుతోంది? అసలీయన వెళ్ళనేలేదేమో? వెళ్ళినా, నే నర్థించినంత మాత్రంలో కృష్ణుడు రావాలని ఏముంది? మళ్ళీ మరొకర్ని పంపనా? నా శ్రేయోభిలాషులెవరున్నారిక్కడ? రుక్మికి ఎదురుచెప్పగలవారీ రాజ్యంలోనే లేరే! ఆ పార్వతీదేవికే నాపై దయలేదు. నేనేం చేయగలదాన్ను?

చుట్టూ ఉన్న పరిసరాల్ని మరిచి, ఆలోచనలు పరిపరివిధాల పోతూండగా, అన్యమనస్కయై రుక్మిణి, అలా కృష్ణుడు రావలసిన దారిపైనే దృష్టి నిలిపి, నిరీక్షిస్తోంది. కళ్ళంట కారే నీళ్ళు తుడుచుకోదు. చెలికత్తెల్ని పల్కరించదు. అన్నమూ, నీరూ ముట్టుకోదు. ఆలస్యమైనకొద్దీ అలంకారాల మీద కూడా మనసు పోలేదు ఆమెకు. ఎదురు చూసి, ఎదురు చూసి విసుగుపుట్టుకొస్తోంది. చిన్నగాలి వీచినా, కోకిల పాడినా, అలవాటుగా చిలక పలకరించినా కోపం వస్తోంది. ఆఖరికి జీవితం మీదే విరక్తి పుట్టి మదన తాపంతో యమయాతనలనుభవించే సమయంలో ఉన్నట్టుండి ఆమెకు ఎడమకన్ను, ఎడమభుజం అదిరేయి.

అగ్నిద్యోతనుడు అంతఃపురంలో ప్రవేశించాడు. ముందుగా రుక్మిణి అనుమానంతో అతని ముఖాన్ని చదివింది. అది చిరునవ్వుల్ని చిందించడంతో శుభవార్తే వినవచ్చునని ఆశించింది. ఆ ఆశ ఆయన మాటల్లో ఇలా ఫలించింది.

''అమ్మాయీ! హరి నీ గుణగణాల్ని చాలా మెచ్చుకున్నాడు. ఈ బీద బ్రాహ్మడికి చాలా బహుమతులు కూడా ముట్టాయి. సురాసురులడ్డమై వచ్చినాసరే, ఆ సుదర్శనాయుధుడు నిన్నే పెళ్ళాడుతానన్నాడు. నావెంట వచ్చాడమ్మా! నీ పుణ్యం ఈనాడు ఫలించింది''

ఆ మాటలు చెవుల్లో తేనెలు పోసినట్టు వినిపించగా, ఆయనకు సవినయంగా నమస్కరించి, ''సద్బంధు చింతామణీ! నా సందేశాన్ని నా ప్రాణేశునికి వినిపించి, నీవెంట తీసుకొచ్చి నా ప్రాణాలు నిలబెట్టావు. నీవంటి పుణ్యాత్ములీ ప్రపంచంలో అరుదు. నీ ఋణం నేనెలా తీర్చుకోగలను!'' అంది రుక్మిణి కృతజ్ఞతా భావంతో.

శ్రీకృష్ణుడు తన రాజ్యానికి వచ్చాడన్న వార్త తెలిసి, భీష్మకుడు సగౌరవంగా ఆతనిని ఆదరించి విడిది ఏర్పాటు చేయించాడు. ఆ నోటా, ఆ నోటా ఈ వృత్తాంతం కుండిన నగర వాసులందరికీ తెలిసిపోయింది. ఆ లీలావినోదుడిని కళ్లారా చూసి ఆనందించేదుకు తండోప తండాలుగా రాసాగారు. ఆ భగవంతుడి అందచందాలకి ముగ్ధులయ్యారు. మన రుక్మిణమ్మకి తగిన వరుడని మురిసిపోయారు. ఒకళ్ల కోసం మరొకళ్లన్నట్టుగా సృష్టించాడని బ్రహ్మ గొప్పతనాన్ని పొగిడారు. వీరి వివాహం సంపన్నం కావడం మన అదృష్టం అని మనసులోనే కోరుకున్నారు.

అంతఃపురంలో రుక్మిణీదేవి మనసు కుదుటపడింది. దేవీ పూజకి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. నాలుగు ప్రక్కలా భటులు కాపలా కాస్తుండగా, కానుకలు, ఉపహారాలూ, పుష్పగంధాభరణాదులు మోసుకొస్తూ, మంగళారతులు పాడుకుంటూ స్త్రీ జనం వెంటరాగా, మద్దెల తప్పెటలు, శంఖము, కాహళ, వేణువు మొదలైన వాద్యాల ధ్వనులు మిన్నుముట్టగా, బంధుజనం తోడురాగా, ముకుంద చరణారవిందాలే మనసులో నింపి మందగమనంతో దేవాలయం చేరింది రుక్మిణి. తోటి ముత్తైదువులు, గంధ, పుష్పాక్షతలతో శాస్త్రోక్తంగా దేవి పూజ చేసి, రుక్మిణి చేత మ్రొక్కించారు. అప్పుడామె

''దేవీ! దయాంబురాశీ! నిన్ను నమ్మి చెడినవారు లేరు. నాకు హరియే పతిగా వరం ఇయ్యి!'' అని వేడుకుంది.

తనతో వచ్చిన ముత్తైదువలకి వాయినాలిచ్చి, వారి ఆశీస్సులు పొంది, నగరులోనికి తిరుగు ప్రయాణ మారంభించింది. ఆమె మనసంతా తేలికై తన కోరిక తీరగలదన్న నమ్మకంతో, భగవంతుడు తనవైపు ఉన్నాడన్న సావధాన చిత్తంతో నడవసాగింది. అప్పుడామె మేఘాల మధ్య సౌధామినిలా మెరిసిపోతోంది. సృష్టికర్త తెర యెత్తగా పొడసూపిన మేటి నటి మోహినీ దేవతలా తోచింది. సాగర మథనంలో ఉద్భవించిన ఇందిరా సుందరిలా బహువిధ కాంతులు వెదజల్లుతోంది. మానస సరోవరంలోని రాయంచలా నడుస్తూ, రత్నముద్రాలంకృతమైన చేతితో చెలికత్తె చేతిని ఊతగా పట్టుకుని, మరొక చేతితో అలవోకగా, నుదిటిపై బడిన ముంగురుల్ని సవరించుకుంటూ, మధ్యలో మదనకేతనంలో ఎగిరే పైటని సవరించుకుంటూ, మన్మథుడప్పుడే వాడిపెట్టి ఒరలోంచి తీసివేసిన తూపుల్లాంటి చూపులతో, గజ్జెలందియలు ఘల్లని మ్రోయగా, శ్రీకృష్ణుడి రాక కోసం ఎదురుచూస్తూ నడుస్తోంది.



ఆమె అందచందాలు కళ్లారా కాంచిన రాజకుమారులంతా విభ్రాంతులయ్యారు. సమ్మోహితులయ్యారు. గాంభీర్యం, గౌరవ భావాల్ని మరచి చేష్టలుడిగి, రథాలుదిగి, ఆయుధాలు వదిలిపెట్టి మూర్ఛపోయారు. ఆ రాకుమార్తె కళ్ళు, కాంక్షతో యాదవ కిశోరం కోసం నానా దేశ రాజకుమార సమూహాన్ని గాలించసాగాయి.

అంతలోనే, నీలదేహ కాంతితో, పీతాంబరధారియై విశాలవక్షుడు, ఆజానుబాహువు అయిన జగన్మోహనుడు ఆమె కంటబడ్డాడు. క్షణం తడవు లేకుండా, హరి సకల రాజకుమార సమక్షంలో రుక్మిణిని తెచ్చి, తన రథం మీద కూర్చుండబెట్టి, భూనభోంతరాళాలు నిండేలా శంఖం పూరిస్తూ, బలరాముడు, సర్వయాదవ సేనలూ, వెంటరాగా రథాన్ని ద్వారకా నగర మార్గానికి మళ్లించారు.

ఆ అల్లకల్లోలానికి తెలివిని పడ్డారు వీరులంతా! ''అయ్యయ్యో! సింహాలకి చెందవలసిన కీర్తిని నీచమృగాలు కొట్టుకుని పోయినట్టు, రాజమర్యాదలతో మనకు చెందవల్సిన రాకుమారిని, ఈ యాదవ కులస్థుడు ఎత్తుకుపోతున్నాడు. చూస్తూ కూచుంటే, ప్రజలంతా సందుగొందుల్లో మన గురించి చెప్పుకుని నవ్వుకోరా అని కూడబలుక్కుని, రోషంతో హరిని ఎదిరించారు.

ఆ హఠాత్పరిణామానికి కొంత భయపడి, ఆ ఇందువదన, భీతహరిణేక్షణయై, సిగ్గుతో హరి వదనాన్ని చూసింది. హరి చిరునవ్వుతో ''నీకేం భయం లేదు. చూస్తుండగానే, నా సేనలు వారినందర్నీ పటాపంచలు చేస్తాయి'' అని ధైర్యం చెప్పాడు.

తరువాత జరిగిన ఘోర పోరాటంలో, శత్రుసేనలు యాదవ సేనతో పోరాడలేక, ప్రాణాలరచేత బట్టి, పారిపోసాగాయి. పరిస్థితి గమనించి జరాసంధుడు, శిశుపాలుడితో ఇలా అన్నాడు. ''చైద్యరాజా! ఇంతవరకూ నువ్వు శత్రువుల చేజిక్కకపోవడం అదృష్టమే. బ్రతికుంటే మరొక భార్యని పొందవచ్చు. యుద్ధంలో జయాపజయాలు మన అధీనంలో వుండవు. రోజులు మనవి కానప్పుడు ప్రాణాలతో బయటపడటం మంచిది. అదీకాక సహాయార్థం వచ్చిన రాజులు కూడా ఒక్కొక్కరూ జారుకుంటున్నారు. మనం కూడా పలాయన మంత్రం చిత్తగించడం మంచిది'' గత్యంతరం లేక శిశుపాలుడు, తన వారితోసహా యుద్ధరంగం నుంచి నిష్క్రమించాడు.

ఇంతలో జరుగుతున్న ఉదాంతం తెలుసుకుని, రుక్మిణిని ఓ గొల్లవాడు ఎత్తుకుని పోయి పెళ్లాడడమా? అనే రోషంతో, రుక్మి రథారూఢుడై వచ్చి హరిని అడ్డగించాడు. దారికి అడ్డుగా నిలిచి ''ఏమయ్యా! లోకంలో సమాన వియ్యం, సమాన కయ్యం అంటారు. నీవు మా సరివాడవా? మా ఇంటి ఆడపడుచును పెళ్లాడే అర్హత నీకేది? నీ వంశం ఏది? నీవు పుట్టిందెక్కడ, పెరిగిందెక్కడ, నీ నడవడి ఏమి? ఇవన్నీ ఎవ్వరెరుగుదురు? నీకేమైనా మానమర్యాదలున్నాయా? అసలు నువ్వు రాజవంశంలో పుట్టినవాడివేనా? చాలు చాలు, మా అమ్మాయిని విడిచిపెట్టు, లేదా ఇవిగో కాచుకో బాణాలు'' అని యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు.

ప్రగల్భాలు పలుకుతూ, మీదిమీదికి వచ్చే బావమరదిని హరి చిరునవ్వుతో ఎదుర్కొని అతని ప్రతీ ఆయుధాన్నీ చిత్తుచేశాడు. రుక్మి కోపం పట్టలేక, తన కరవాలం తీసుకుని, అగ్నిలో దూకే శలభంలా హరి మీదికురికాడు. కృష్ణుడు అతని ఖడ్గాన్ని ఛిన్నాభిన్నం చేసి, శిరః ఖండనం చేయబోయాడు. తన కారణంగా అన్నగారు ప్రాణాలు కోల్పోతాడన్న భయంతో రుక్మిణి హరి చరణాలు పట్టుకుంది.

''సర్వ లోక శరణ్యా! అనాథ నాథా! దయానిధీ! నీవే దేవదేవుడవనే నిజం తెలుసుకోలేక నా అన్నగారు నీ యెడపరాధం చేశాడు. కానీ, ముకుందా! నీ అంతటి పురుషోత్తముడు అల్లుడయ్యాడని ఆనందించే నా తల్లిదండ్రులకి, ఈ శుభసమయంలో పుత్రశోకాన్ని కలిగించకోయ్!'' అని డగ్గుత్తికతో, మహా భయంతో, శరీరం కంపిస్తూండగా, కళ్లనిండా నీళ్లు నింపుకుని వేడుకుంది.

ఆమె దుఃఖాన్ని చూచిన యాదవ వీరుడు శాంత చిత్తుడై రుక్మిని చంపే ప్రయత్నం విరమించి, నవ్వుతూ, ''బావా! నీకు మానమర్యాదలు కావాలా? ఇలారా!'' అని చేరబిలిచి, గెడ్డాలూ, మీసాలు గొరికి విరూపిని చేశాడు.

ఈలోగా శత్రుబలాన్ని పారద్రోలి బలరాముడు సైన్యంతో సహా తిరిగి వచ్చాడు. హతప్రాణుడై యున్న రుక్మిని చూసి జాలిపడి, ''అయ్యో! కృష్ణా! బంధువు అనియైనా ఆలోచించకుండా ఇలా చేశావేంటి? తల గొరుగుట, తల తరుగుట కంటే హీనమైనది కదా! నీకు శత్రువులైనా, మిత్రులైనా అంతా ఒకటే కదా! నీవంటివారికిలాంటి విషమ బుద్ధి ఏలనయ్యా?'' అని సుతారంగా మందలించాడు.

పాపం! తోడబుట్టినవాని భంగపాటుకి లోలోపలే దుఃఖిస్తున్న రుక్మిణీ భామను చూసి, ఆమెను ఓదార్చే ఉద్దేశంతో ఇలా అన్నాడు. ''తల్లీ! మా తమ్ముడు, నీ అన్నకు విధించిన శిక్షకు నీవు కోపించకమ్మా! ఇందులో శిక్షించేదెవరు? శిక్షింపబడేదెవరు? ఇదంతా పూర్వజన్మలో చేసిన కర్మపరిపాక ఫలం. ఇన్నాళ్లకి నీ సహోదరుడి కర్మశేషం అంతరించిందనుకో. చంపదగినంత దోషం ఉన్నాసరే బంధువు అన్నవాడిని చంపరాదు. అసలే అవమానంతో చచ్చినవాడిని ఇంకా చంపడమెందుకు? రాజ్యకాంక్షతో అంధుడైనవాడు తోడబుట్టినవారిని కూడా చంపజూస్తాడు. అది విధి లిఖితము. భూమి కోసం, ధనధాన్యాల కోసం, స్త్రీ జనాల కారణంగానూ, కిందుమీదులు గానక, మదాంధులైన మానవులొకరినొకరు చంపుకుంటారు. సూర్యచంద్రులు ఆకాశమూ, నీళ్ల పాత్రలో విడివిడిగా ఎందరిలాగో కనిపించినట్టుగా, ఈ మానవులందరికీ ఆత్మ ఒకటైనప్పటికీ వివిధ రకాలుగా కనిపిస్తుంది. చావు పుట్టుకలున్న ఈ శరీరం, ద్రవ్య ప్రాణ గుణాత్మకమై, ఆత్మలోని అవిద్య వలన మనిషిని ఈ ప్రపంచంలో త్రిప్పుతూంటుంది. సూర్యకాంతి వలన వస్తువులు ప్రకాశించినట్టు, ఆత్మవల్ల దేహేంద్రియాలు ప్రకాశమానం అవుతాయి. ఆత్మ అనేదానికి దేనితోనూ సంయోగ వియోగాలు లేవు. వృద్ధిక్షయాలు చంద్రకళలకే గాని చంద్రుడికి లేవుగదా! నిద్రపోయినవాడు కూడా ఆత్మను విషయ ఫలానుభోగము చేసినట్టు, అజ్ఞాని అయినవాడు, నిరర్థకాలైన అర్థ ప్రాణాలకి విలువనాపాదిస్తాడు. కనుక అమ్మాయీ! అజ్ఞానురాలవై నీవు శోకించకు. నీవంటి వివేకవంతులకిది తగదు.''

రుక్మి అవమానభారంతో క్రుంగిపోయి, తన రూపం తనకే ఏవగింపు కాగా, శ్రీకృష్ణుణ్ణి గెలిచికాని తిరిగి ఇంటికి వెళ్లేది లేదని ప్రతిజ్ఞ చేసి అక్కడే కూలబడ్డాడు.

ద్వారకకు వెళ్లి హరి, రుక్మిణిని మహావైభవంగా వివాహమాడాడు. రాజాధి రాజులంతా అతని మహిమల్ని వేనోళ్ల కొనియాడారు. ఆ రుక్మిణియే ఆదిలక్ష్మి, ఆ హరియే సాక్షాత్తు విష్ణుమూర్తి. వారి కల్యాణం ఇలా వైభోగంగా సంపన్నం అయింది.

(పోతన భాగవతం ఆధారంగా) ★